సాక్షి
బాపట్ల
గురువారం । 13 । మార్చి । 2025



వైభవంగా శతచండీ మహాయాగం

సత్తెనపల్లి: పట్టణంలోని త్రిశక్తి దుర్గాపీఠంలో శతాధిక ప్రతిష్ఠా బ్రహ్మ హనుమత్‌స్వామి ఆధ్వర్యంలో నవదుర్గాత్మక శత చండీ మహాయాగం బుధవారం నిర్వహించారు.



'బార్' ఎన్నికలకు ఏడు నామినేషన్లు

గుంటూరు లీగల్: గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలకు సంబంధించి బుధవారం ఏడుగురు అభ్యర్థులు వివిధ పోస్టులకు నామినేషన్ దాఖలు చేశారు.



రేపు కోటప్పకొండ గిరి ప్రదక్షిణ

నరసరావుపేట రూరల్: ఈనెల 14వ తేదీ ఉదయం 5గంటలకు త్రికోటేశ్వర స్వామి గిరి ప్రదక్షిణ ప్రారంభమవుతుందని గిరి ప్రదక్షిణ సేవా సమితి అధ్యక్షుడు వెంకయ్య తెలిపారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (గురు)	సహర్ (శుక్ర)
బాపట్ల	6.23	5.01
నరసరావుపేట	6.25	5.03
గుంటూరు	6.23	5.01

యువతరంగం కదిలింది

- పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున ఆధ్వర్యంలో నిరసన
- కోన భవన్ నుంచి కలెక్టరేట్‌కు ర్యాలీ
- పాల్గొన్న కోన రఘుపతి, వరికూటి అశోక్ బాబు ,కరణం వెంకటేశ్, గాదె మధు, హనిమిరెడ్డి, ఈవూరి గణేష్
- వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు
- కలెక్టరేట్‌కు వెళ్లే దారిలో రెండుచోట్ల బారికేడ్లు పెట్టి అడ్డుకున్న పోలీసులు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన ర్యాలీ
- అడ్డుకున్న పోలీసులు , ఇరువర్గాల మధ్య తోపులాట
- బారికేడ్లు దాటుకొని కలెక్టరేట్‌లోకి చొచ్చుకెళ్లిన వరికూటి
- ఆయన వెంటే లోపలికి వెళ్లిన నేతలు, పార్టీ శ్రేణులు
- కలెక్టర్ కార్యాలయం వద్ద అరగంట సేపు నిరసన

బాపట్లలో మిన్నంటిన 'యువత పోరు'



పోలీసుల బారికేడ్లు ఛేదించి కలెక్టర్ కార్యాలయంలోకి వెళుతున్న మేరుగ, పార్టీ శ్రేణులు

కూటమి ప్రభుత్వం మోసం, నయవంచనపై విద్యార్థులు, నిరుద్యోగులు భగ్గుమన్నారు. సముద్ర తరంగమై విరుచుకుపడ్డారు. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన ఒక్క హామీని నెరవేర్చనందుకు నిరసనగా వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన పిలుపునందుకొని బుధవారం బాపట్లలో చేపట్టిన 'యువత పోరు'లో పార్టీ శ్రేణులతో పాటు విద్యార్థులు, నిరుద్యోగులు కదం తొక్కారు. సిగ్గు లేని ప్రభుత్వాన్ని నిగ్గ దీశారు.

సాక్షి ప్రతినిధి, బాపట్ల: వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పిలుపునందుకొని పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున నేతృత్వంలో బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి, వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు, చీరాల సమన్వయకర్త కరణం వెంకటేశ్, రేపల్లె సమన్వయకర్త ఈవూరి గణేష్, అద్దంకి సమన్వయకర్త పానెం హనిమిరెడ్డి అనుచరులతో కలిసి ఉదయం పదిన్నర గంటలకే బాపట్ల పట్టణంలోని కోన భవన్‌కు చేరుకున్నారు. అక్కడినుంచి 11 గంటల ప్రాంతంలో కలెక్టరేట్‌కు ర్యాలీగా బయలుదేరారు. కార్యకర్తల జై.. జగన్ నినాదాలతో బాపట్ల పట్టణం హోరెత్తింది. కలెక్టరేట్ సమీపంలో పోలీసులు రెండుచోట్ల బారికేడ్లు పెట్టి వైఎస్సార్‌సీపీ శ్రేణులను అడ్డుకున్నారు. కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం ఇవ్వడానికి మాత్రమే వెళుతున్నామని అనుమతించాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున, కోన రఘుపతి మిగిలిన నేతలు కోరినా పోలీసులు అంగీకరించలేదు. దీంతో కొద్దిసేపు నేతలు, కార్యకర్తలు అక్కడే నిరసన చేపట్టారు. ఇంతలో వేమూరు సమన్వయకర్త వరికూటి అశోక్‌బాబు అనుచరులతో కలిసి కలెక్టరేట్ లోపలికెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. అప్పటికే వేలాదిగా చేరుకున్న కార్యకర్తలు జై.. జగన్ నినాదాలతో ఒక్కసారిగా బారికేడ్లను తోసుకొని లోపలికి దూసుకవెళ్లడంతో మిగిలిన నేతలు, కార్యకర్తలు కలెక్టరేట్ ప్రాంగణానికి పరుగులు పెట్టారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు పెద్దఎత్తున రావడంతో పోలీసులు గేటుకు తాళాలు వేశారు. దీంతో నేతలు కార్యకర్తలతో కలిసి కలెక్టరేట్ బయట అరగంట పాటు నిరసన తెలిపారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తక్షణం విడుదల చేయాలని, ఇచ్చిన హామీమేరకు నిరుద్యోగులకు 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్‌చేశారు. నిరుద్యోగులకు నెలకు రూ. 3 వేల భృతి చెల్లించాలని నినదించారు. అనంతరం పోలీసులు గేట్లు తెరిచి కలెక్టర్‌ను కలిసేందుకు వైఎస్సార్‌సీపీ నేతలను లోపలికి అనుమతించారు. దీంతో జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జునతోపాటు నేతలు జిల్లా కలెక్టర్ వెంకట మురళిని కలిసి వినతిపత్రం సమర్పించారు.

పోలీసుల చర్యలపై ఆగ్రహం

వైఎస్సార్‌సీపీ అధినేత పిలుపునందుకొని విద్యార్థుల సమస్యలపై శాంతియుతంగా ర్యాలీ నిర్వహించి కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చేందుకు పార్టీ నేతలు ,కార్యకర్తలు తరలివస్తే పోలీసులు కలెక్టరేట్‌లోకి అనుమతించకుండా అడ్డుకోవడంపై పార్టీ నేతలు విమర్శలు గుప్పించారు. బారికేడ్లు పెట్టి మరీ అడ్డుకునే ప్రయత్నం సరికాదన్నారు. వారు అడ్డుకునే ప్రయత్నం చేయడంవల్లే ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయని, నేరుగా అనుమతిస్తే వినతిపత్రం ఇచ్చి వచ్చేవారమని పలువురు నేతలు పేర్కొన్నారు.

చంద్రబాబూ.. ఇచ్చిన మాట నిలబెట్టుకో : మేరుగ



సమావేశంలో మాట్లాడుతున్న మేరుగ

బాపట్ల: ''విద్యార్థులు ఫీజులు కట్టందే కాలేజీలు సర్టిఫికెట్ ఇవ్వడం లేదు. సర్టిఫికెట్ అడిగితే డబ్బులు కట్టి తీసుక వెళ్లమని చెబుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీతో పాటు అన్నికులాల పేద విద్యార్థులు ఫీజులు కట్టలేక ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి ఉంది. అయ్యా చంద్రబాబూ...ఎన్నికల ముందు చెప్పినట్లు తక్షణం విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించండి '' అని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగారున డిమాండ్ చేశారు. యువత పోరు ఆందోళనలో భాగంగా బుధవారం బాపట్ల కలెక్టరేట్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తమ నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రజాస్వామ్యబద్ధంగా వెళ్లి విద్యార్థుల సమస్యలపై వినతిపత్రం ఇవ్వాలని చెబితే.. కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా మూడు చోట్ల పోలీసులు అత్యుత్సాహంతో అడ్డుకున్నారని బారికేడ్లే పెట్టి తాళ్లు, గొలుసులతో కట్టారని విమర్శించారు. గొడవలు చేయడానికో, తప్పులు చేయడానికో తాము టెర్రరిస్టులం కామన్నారు. ప్రజల హక్కులను కాపాడే ప్రయత్నం చేస్తున్న తమను అడ్డుకోవడం ఎంతవరకు న్యాయమని ఆయన పోలీసులను ప్రశ్నించారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్తలు కోన రఘుపతి, వరికూటి అశోక్‌బాబు, కరణం వెంకటేశ్, ఈవూరి గణేష్, పానెం హనిమిరెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి బిల్లాల డేవిడ్, జిల్లా ఉపాధ్యక్షుడు కోకి రాఘవరెడ్డి పాల్గొన్నారు.



కలెక్టర్ వెంకట మురళికి వినతిపత్రం ఇస్తున్న మేరుగ నాగార్జున, నేతలు



బారికేడ్లు దాటుకొని కలెక్టర్ కార్యాలయంలోకి వెళుతున్న అశోక్ బాబు, పార్టీ శ్రేణులు



వైఎస్సార్ సీపీ నేతల బైక్ ర్యాలీ

న్యూస్‌రీల్

గుత్తికొండ బిలంలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు

పిడుగురాళ్ల: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన గుత్తికొండ బిలాన్ని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి టి.సుజాత బుధవారం సందర్శించారు. బిలంలోని పుణ్యక్షేత్రంలో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం హైకోర్టులో గుమస్తాగా పనిచేస్తూ ఇటీవల మృతిచెందిన మండలంలోని జూలకల్లు గ్రామానికి చెందిన సంధ్యానాయక్ కుటుంబ సభ్యులను వారి స్వగృహంలో పరామర్శించారు. ఆమె వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

బ్రిడ్జి నిర్మాణ పనులు పరిశీలించిన ఆర్డీఓ



అచ్చంపేట: మండలంలోని మాదిపాడులో ప్రభుత్వ భూములను ఆర్డీఓ జి.రమాకాంత్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. మాదిపాడు నుంచి పులిచింతల ప్రాజెక్టు వరకు నిర్మాణంలో ఉన్న రోడ్డుకు అంతరాయం కలుగచేస్తున్న వారి భూములను పరిశీలించి, నిర్మాణానికి ఎలాంటి ఆటంకం కలిగించవద్దని సూచించారు. అనంతరం కృష్ణానదిపై మంజూరైన వంతెన నిర్మాణానికి కావలసిన అనుమతులు, భూసేకరణ తదితర వివరాలను కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో సుమారు 20 ఎకరాలకు పైగా ప్రభుత్వ భూములుండగా వాటిని ఏవిధంగా వినియోగించుకోవాలనే విషయంపై తహసీల్దార్‌తో చర్చించారు. వారి వెంట వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బంది, రెవెన్యూ అధికారులు ఉన్నారు.

పులిహోరతో వెంకటేశ్వర స్వామి నమూనా

45 కిలోల వినియోగం



చీరాల అర్బన్: పట్టణంలోని గడియార స్తంభం సెంటర్‌లో గల శ్రీ వేదవల్లి కనకవల్లి తాయార్ల సమేత శ్రీ వీరరాఘవస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్వామికి ప్రాతరోపాసన, బలిహరణ జరిపారు. ఆలయంలో మూలవిరాట్‌కు ఎదురుగా 45 కేజీల పులిహోరతో ఏర్పాటు చేసిన వెంకటేశ్వరస్వామి నమూనా భక్తులను ఆకర్షించింది. పూజలను అర్చకులు దిట్టకవి వాసుదేవాచార్యులు, ఎస్.పార్థసారథి నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కబ్జాపై కదిలిన యంత్రాంగం

అక్రమాలకు పాల్పడిన అధికారులకు నోటీసులు

సాక్షి ఎఫెక్ట్

గురజాల రూరల్: గురజాల జగనన్న కాలనీలో 70 సెంట్ల స్థలాన్ని కూటమి నేతలు కబ్జా చేసిన వైనంపై రా'జాగా' కబ్జా అనే శీర్షికతో బుధవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అక్రమాలకు పాల్పడిన పలువురు అధికారులకు ఉన్నతాధికారులు నోటీసులు జారీ చేశారు. పలువురికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వి.మురళీకృష్ణ మాట్లాడుతూ గతంలో రీ సర్వే సరిగ్గా చేయని ఇద్దరు సర్వేయర్లకు, జగనన్న కాలనీని అక్రమ రిజిస్ట్రేషన్లకు సహకరించారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న వీఆర్వోకు షోకాజ్ నోటీసులు అందించామన్నారు. ఈ విషయంలో ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదని తెలిపారు. సర్వే చేయించి పూర్తిగా విచారణ జరిపిస్తామని చెప్పారు. అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకున్నట్లు విచారణలో తేలితే రద్దు చేస్తామని ఆయన వివరించారు.

ఉద్యోగులకు నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణ

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

బాపట్ల: ప్రభుత్వ ఉద్యోగుల సంస్థాగత నిర్మాణం, నైపుణ్యాల అభివృద్ధిపై ప్రత్యేక శిక్షణలు ఇస్తున్నామని కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. జిల్లా ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఐజీఓటీ కర్మయోగి డిజిటల్ శిక్షణ తరగతులు స్థానిక కలెక్టరేట్ ఆవరణలో బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఐజీఓటీ కర్మయోగి వెబ్ పోర్టల్ నుంచి ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వం డిజిటల్ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రథమంగా అన్ని ప్రభుత్వ శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇస్తున్నామని పేర్కొన్నారు. మారుతున్న కాలానుగుణంగా ప్రభుత్వ ఉద్యోగులు నవీకరణ పొందడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల్లో సీఎఫ్ఎంఎస్ఐడీ ఉన్న ప్రతి ఉద్యోగికి శిక్షణ అవసరమని, ఈనెల 20వ తేదీలోగా వెబ్ పోర్టల్ నుంచి ఆన్‌లైన్ ద్వారా డిజిటల్ శిక్షణ పొందాలని ఆదేశించారు. శిక్షణ అనంతరం ఆన్‌లైన్‌లో వచ్చే ప్రశ్నావళికి సరైన సమాధానాలు ఇవ్వాలని తెలిపారు. ఉద్యోగుల నైపుణ్యాలకు మెరుగులు పెట్టడానికే 856 శిక్షణ కోర్సులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. ఉద్యోగులంతా సద్వినియోగం చేసుకునేలా అధికారులు క్షేత్రస్థాయిలో శిక్షణలు ఇవ్వాలని కలెక్టర్ వివరించారు. జిల్లా ప్రణాళిక అధికారి కె. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి వారం శిక్షణ తరగతులు ఆన్‌లైన్‌లో నవీకరణ పొందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. అధికారులు ఈ విషయాన్ని గుర్తించి ఉద్యోగులందరికీ అవగాహన కల్పించాలని చెప్పారు. సందేహాలకు ఎస్. హరినాథ్ (96521 71785), వి. సృజన (90634 94729) సంప్రదించవచ్చని సూచించారు. ఎంపీడీవోలు తమ పరిధిలోని ఉద్యోగులందరికీ శిక్షణలు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో ప్రణాళికా శాఖ ఏపీఎస్‌డీపీఎస్ అధికారి జ్ఞానం , వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈతకు వెళ్లి ఇద్దరు విద్యార్థులు మృతి



ఘటనా స్థలంలో విద్యార్థుల మృతదేహాలు

నరసరావుపేట రూరల్: ఈతకు వెళ్లి ఇద్దకు విద్యార్థులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని పెట్లూరివారిపాలెం సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా కురిచేడుకు చెందిన గోపి(19) నరసరావుపేట ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. అద్దంకి మండలం వేంపరాలకు చెందిన తేజ్‌కుమార్(19) ఏఎం రెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో డిప్లొమా తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. వీరిద్దరూ పట్టణంలోని ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. బుధవారం సాయంత్రం గోపి, తేజ్‌కుమార్‌లు మరో ఇద్దరు స్నేహితులతో కలిసి పెట్లూరివారిపాలెం సమీపంలోని 10 ఆర్ మేజర్ కాలువలో ఈతకు వెళ్లారు. గోపి, తేజ్‌కుమార్‌లకు ఈత రాకపోయినా నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో కాలువలో దిగారు. డ్రాప్ పైనుంచి ఇద్దరు నీటిలోకి దూకారు. డ్రాప్ కింద నీటి ఉధృతి కారణంగా మట్టి కోతకు గురై లోతు ఎక్కువగా ఉంటుంది. దీన్ని వారు గమనించకపోడంతో ఈత రాక నీటమునిగారు. కాలువ కట్టపై ఉన్న స్నేహితులు గమనించి కేకలు వేశారు. మిర్చిపొలాల్లో కోతకు వచ్చిన కూలీలు అక్కడకు చేరుకొని కాలువలోకి దిగి ఇద్దరిని ఒడ్డుకు చేర్చారు. అప్పటికే మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కిశోర్ తెలిపారు.

ఉత్సాహం.. ఉత్తేజం

- జిల్లా అంతటా వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవం
- భారీగా పాల్గొన్న పార్టీ శ్రేణులు



పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేస్తున్న జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, కోన రఘుపతి, ఈవూరి గణేష్, కరణం వెంకటేష్‌బాబు తదితరులు

బాపట్ల: వైఎస్సార్ సీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని బుధవారం జిల్లావ్యాప్తంగా నిర్వహించారు. తొలుత అన్ని నియోజకవర్గాల్లో పార్టీ ఇన్‌చార్జులు మహానేత డాక్టరు వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. పార్టీ కార్యాలయాల్లో పండగ వాతావరణంలో కేకలు కట్ చేశారు.

- బాపట్ల నియోజకవర్గంలో కోన రఘుపతి ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ రేపల్లె ఇన్‌చార్జి ఈవూరి గణేష్, చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు పాల్గొన్నారు.
- పర్చూరులో ఇన్‌చార్జి గాదె మధుసూదనరెడ్డి ఆధ్వర్యాన పావులూరులో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
- చీరాలలో ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు ఆధ్వర్యంలో సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మిఠాయిలు పంపిణీ చేశారు.
- వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు ఆధ్వర్యంలో భట్టిప్రోలులో వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు.
- అద్దంకి నియోజకవర్గంలో ఇన్‌చార్జి పానెం చిన హనిమిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.
- రేపల్లె నియోజకవర్గం పరిధిలో ఇన్‌చార్జి ఈవూరి గణేష్ ఆధ్వర్యంలో చెరుకుపల్లిలోని పార్టీ కార్యాలయం వద్ద మిఠాయిలు పంపిణీ చేశారు. మహానేత డాక్టరు వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యకర్తలు రెట్టించిన ఉత్సాహంతో పాల్గొన్నారు.

శింగరకొండ తిరునాళ్ల ప్రారంభం

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్య క్షేత్రమైన శింగరకొండ తిరునాళ్లను గురువారం ఉదయం ప్రారంభించారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం గణపతి పూజ, పుణ్యాహవాచన, అఖండ దీప స్థాపన, మండపారాధన నిర్వహించారు. అనంతరం ధ్వజ స్తంభ నిర్మాణ దాత మేదరమెట్ల శంకర రెడ్డితో అర్చకులు జీవ ధ్వజ పూజ చేయించారు. ఉష్ట్ర పతాకాన్ని ధ్వజారోహణ చేయించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రి

శింగరకొండ తిరునాళ్ల ఉత్సవాల్లో భాగంగా మొదటిరోజు బుధవారం రాత్రి ప్రసన్నాంజనేయ స్వామికి రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్ పట్టు వస్త్రాలు సమర్పించారు. నగరోత్సవంలో భాగంగా రథాన్ని లాగిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి నిమిషానికి ప్రత్యేక బస్సు

అద్దంకి: జిల్లాలోనే ప్రముఖ పుణ్య క్షేత్రంగా పేరుగాంచిన ప్రసన్నాంజనేయ, శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి తిరునాళ్ల సందర్భంగా ఈ నెల 14వ తేదీ ఉదయం 5 గంటల నుంచి ప్రతి నిమిషానికి ఒక ప్రత్యేక బస్సు డిపో నుంచి నడపనున్నారు. ఈమేరకు డిపో మేనేజర్ బి. మోహనరావు బుధవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. రాష్ట్ర నలుమూలల నుంచి తిరునాళ్లకు వచ్చే భక్తులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఒక్కో టికెట్ రూ.10 మాత్రమేనని తెలిపారు.



స్వామికి పట్టు వస్త్రాలు తీసుకొస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్



ఉష్ట్ర పతాకానికి పూజలు నిర్వహిస్తున్న ధ్వజ స్తంభ దాత, అర్చకులు

క్లుప్తంగా

ఎన్జీరంగా వర్సిటీని సందర్శించిన అమెరికా ప్రొఫెసర్



గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాం ఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని అమెరికా వ్యవసాయ విద్యాలయం ప్రొఫెసర్ ఆచార్య ఎంఎస్ రెడ్డి బుధవారం సందర్శించారు. విశ్వవిద్యాలయంలోని శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, అధికారులు, విద్యార్థులతో ముఖాముఖీ చర్చల్లో పాల్గొన్నారు. విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్.శారద జయలక్ష్మీదేవి మన భవిష్యత్తును కాపాడుకునేందుకు మొక్కలు, నేలల ఆరోగ్యం కాపాడుకోవటంలో ప్రపంచ వ్యాప్తంగా ఉద్భవిస్తున్న సమస్యలను ఎలా అధిగమించాలి అనే అంశాలపై ఆయనతో చర్చించారు. విదేశాల్లో చేసిన వ్యవసాయ పరిశోధనలు, వాటి వల్ల కలిగే ఉపయోగాలను ప్రొఫెసర్ ఎంఎస్ రెడ్డి వివరించారు. అనంతరం విశ్వవిద్యాలయం అధికారులు ఎంఎస్ రెడ్డిని సన్మానించారు.

అగ్నివీర్ దరఖాస్తుకు ఏప్రిల్ 10 వరకు గడువు

గుంటూరు ఎడ్యుకేషన్: భారత సైన్యంలో అగ్నివీర్ ద్వారా వివిధ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలకు చెందిన అభ్యర్థుల కోసం దరఖాస్తు ప్రక్రియ ప్రారంభించినట్లు గుంటూరులోని ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయ డైరెక్టర్ కల్నల్ పునీత్ కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విభాగాలవారీగా www.ojinindianarmy.nic.in ద్వారా ఏప్రిల్ 10వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక అభ్యర్థి రెండు వేర్వేరు విభాగాల్లో దరఖాస్తు చేసుకోవచ్చునని వివరించారు. ఆన్‌లైన్ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (సీఈఈ) తొలిసారిగా తెలుగుతో సహా 13 వేర్వేరు భాషల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. 1.6 కిలోమీటర్ల పరుగు సమయాన్ని ఆరు నిముషాల 15 సెకన్లకు పెంచినట్లు వివరించారు. అన్ని కేటగిరీలకు సంబంధించిన ఎన్‌సీసీ ఏ, బీ, సీ సర్టిఫికెట్ కలిగిన అభ్యర్థులతో పాటు ప్రతిభావంతులైన క్రీడాకారులకు, అగ్నివీర్ టెక్నికల్ కేటగిరీ కోసం ఐటీఐ, డిప్లొమా అర్హత కలిగిన అభ్యర్థులకు అదనపు మార్కులు కేటాయించనున్నట్లు వివరించారు. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్సార్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చునని సూచించారు.



వైఎస్సార్ సీపీ శ్రేణులను అడ్డుకుంటున్న పోలీసులు



బారికేడ్లు దాటుకొని కలెక్టర్ కార్యాలయంలోకి వెళుతున్న అశోక్‌బాబు, పార్టీ శ్రేణులు



పోలీసులు, వైఎస్సార్ సీపీ శ్రేణుల మధ్య తోపులాట

యువత పోరులో నిరసనల హోరు

వైఎస్సార్ సీపీ నిర్వహించిన 'యువత పోరు' ర్యాలీకి బాపట్ల జిల్లాలో అనూహ్య స్పందన లభించింది. బారికేడ్లు పెట్టి అడుగడుగునా నేతలను పోలీసులతో అడ్డుకునేందుకు ప్రభుత్వం ప్రయత్నించింది. పట్టణంలోని రథం బజారులో గల వైఎస్సార్ సీపీ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు. కలెక్టరేట్ వద్ద కూడా ప్రభుత్వం భారీగా పోలీసులను మోహరింపజేసింది. ఒకానొక దశలో పోలీసులు, వైఎస్సార్ సీపీ శ్రేణుల మధ్య తోపులాట జరిగింది. ఈ సమయంలో మెరుపు వేగంతో అశోక్‌బాబు, పార్టీ శ్రేణులు బారికేడ్లు దాటుకొని కలెక్టర్ కార్యాలయంలోకి చొచ్చుకు వెళ్లిపోయారు. ఆయన వెంటే లోపలికి నేతలు, పార్టీ శ్రేణులు ప్రవాహంలా కదిలారు. – సాక్షి ప్రతినిధి, బాపట్ల

శిలా ఫలకాలు తొలగించడం సరికాదు !

మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి

బాపట్ల టౌన్: సాక్షాత్తు కలెక్టర్ కార్యాలయంలోని శిలా ఫలకాలకే రక్షణ లేకపోతే మారుమూల ప్రాంతాల పరిస్థితి ఇంకెలా ఉంటుందో ? అంటూ మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యువత పోరులో భాగంగా బుధవారం కలెక్టర్ కార్యాలయానికి చేరుకున్న ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల సౌకర్యార్థం బాపట్లను జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసిన తర్వాత అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నా కలెక్టర్ కార్యాలయం, జిల్లాలోని వివిధ శాఖల అధికారుల కార్యాలయాలు ఏర్పాటు చేసి ప్రజలకు సుపరిపాలన అందించిన ఘనత రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని తెలిపారు. నాడు ఎంతో పండుగ వాతావరణంలో జిల్లా కలెక్టర్ కార్యాలయాన్ని ప్రారంభించామని గుర్తు చేశారు. నేడు అక్కడ గత ప్రభుత్వ ఆనవాళ్లు కూడా చేయాలనే దురుద్దేశంతో శిలాఫలకాలు తొలగించడం ఎంతవరకు సమంజసమో అధికారులే సమాధానం చెప్పాలని ఆయన ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ దుస్థితి ఉంటే, జిల్లాలోని మారుమూల ప్రాంతాల్లో ఇంకెంత దారుణంగా ఉంటుందో ఇట్టే అర్థమవుతుందని తెలిపారు. కూటమి సర్కార్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో కూడా శిలాఫలకాలను ఇష్టమొచ్చినట్లు జిల్లావ్యాప్తంగా ధ్వంసం చేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. ఇప్పటికే చాలాచోట్ల తొలగించారని తెలిపారు. జిల్లావ్యాప్తంగా నిబంధనలు ఉల్లంఘించి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని మండిపడ్డారు. శిలాఫలకాల తొలగింపుపై పూర్తిస్థాయిలో విచారణ చేసి, వాటిని యథాస్థానంలో నిర్మించాలని, లేనిపక్షంలో అధికారుల తీరును న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లి పోరాటం చేస్తామని రఘుపతి హెచ్చరించారు.



కలెక్టర్ కార్యాలయంలో మాట్లాడుతున్న రఘుపతి

ప్రజల గుండెల్లో వైఎస్సార్ సీపీకి సుస్థిర స్థానం

బాపట్ల: ప్రజల గుండెల్లో నిండిన పార్టీ వైఎస్సార్ సీపీ మాత్రమేనని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున పేర్కొన్నారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో భారీ కేక్ కట్ చేశారు. అనంతరం కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. పార్టీ కార్యకర్తలకు అండగా ఉంటామని తెలిపారు. కష్టపడిన ప్రతి ఒక్కరికీ మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ డెప్యూటీ స్పీకర్ కోన రఘుపతి మాట్లాడుతూ ప్రజారంజక పాలన అందించిన వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకునే వరకు ప్రతి ఒక్కరం కష్టపడి పని చేద్దామని పిలుపునిచ్చారు. అబద్ధాల మాటలు నమ్మి కూటమి ప్రభుత్వానికి ప్రజలు ఓట్లు వేశారన్నారు. ఎందుకు ఇంత పెద్ద తప్పు చేశామని ఇప్పుడు బాధపడుతున్నారని పేర్కొన్నారు. ప్రజలకు సూపర్‌సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని నిలదీద్దామని కోన పిలుపునిచ్చారు. ఆశపడి ఓట్లు వేసిన ప్రజలను మోసం చేసిన చంద్రబాబు సర్కారుకు సరైన బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో రేపల్లె ఇన్‌చార్జి ఈవూరి గణేష్, చీరాల ఇన్‌చార్జి కరణం వెంకటేష్‌బాబు, పట్టణ, మండల అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, మరుప్రోలు కొండలరెడ్డి, ఉయ్యూరు లీలా శ్రీనివాసరెడ్డి, కోకి రాఘవరెడ్డి, వడ్డి ముక్కల డేవిడ్, గవిని కృష్ణమూర్తి, దొంతిబోయిన సీతారామిరెడ్డి, సోహిత్, గంగిశెట్టి రత్తయ్య, కటికల యోహోషువా, జోగి రాజా పాల్గొన్నారు.

సుఖ జీవనానికి నూతన ఆవిష్కరణలు దోహదం

ఏఎన్‌యూ ప్రొఫెసర్ డాక్టర్ పీవీ కృష్ణ

నగరం: శాస్త్ర సాంకేతిక రంగాల్లో నూతన ఆవిష్కరణలు మానవాళి సుఖ జీవనానికి దోహదపడుతున్నాయని ఆచార్య నాగార్జున విశ్వవిదాలయం ప్రొఫెసర్ డాక్టర్ పీవీ కృష్ణ చెప్పారు. స్థానిక ఎస్వీఆర్ఎం కళాశాలలో బుధవారం 'జీవ శాస్త్రంలో నూతన పోకడలు' అనే అంశంపై నిర్వహించిన జాతీయ సదస్సులో ఆయన మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే నూతన ఆవిష్కరణలపై దృష్టి సారించాలని తెలిపారు.నేడు అన్ని రంగాల్లో పరిశోధనలు విజయవంతం కావడంతో విప్లవాత్మకమైన మార్పులు సంభవిస్తున్నాయని వివరించారు. ఆక్వా రంగంలో నూతన పోకడలతో రొయ్యలు, చేపలు



పెంపకంలో దిగుబడులు పెరిగాయని, ఎగుమతులు కూడా అధికంగా ఉన్నాయని పేర్కొన్నారు. సమావేశంలో ఏఎన్‌యూ బయోటెక్నాలజీ, నానో టెక్నాలజీ ప్రొఫెసర్లు డాక్టర్ కె. కస్తూర్, డాక్టర్ గిరిధర్‌లు నూతన ఆవిష్కరణలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చియ్య చౌదరి, ప్రిన్సిపాల్ అనగాని హరికృష్ణ, అకడమిక్ డైరెక్టర్ వి. వెంకటస్తశ్వరావు, బోటనీ హెచ్‌వోడీ పి. వెంకటనారాయణ, జువాలజీ హెచ్‌వోడీ కె.సురేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సిమెంట్ లారీని ఢీ కొట్టిన ఆర్టీసీ బస్సు

జె.పంగులూరు: వేగంగా ప్రయాణిస్తూ నిద్ర మత్తులోకి జారుకొని ఎదురుగా వెళుతున్న సిమెంట్ లారీని ఢీకొన్న ప్రమాదంలో ఆర్టీసీ బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం తెల్లవారుజామున మండలంలోని రేణింగవరం గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై జరిగింది. రేణింగవరం ఎస్ఐ వినోద్‌బాబు తెలిపిన వివరాలు ప్రకారం.. విశాపట్నం నుంచి తిరుపతికి వెళుతున్న ఆర్టీసీ బస్సు బుధవారం తెల్లవారుజామున రేణింగవరం సమీపంలోకి వచ్చింది. ఆదే సమయంలో డ్రైవర్ కె. శేఖర్ నిద్రమత్తులోకి జారుకుని ఎదురుగా వెళుతున్న సిమెంట్ లారీని ఢీకొట్టాడు. వెంటనే తేరుకొని ఎడమవైపు బస్సును తిప్పడంతో పొలాల్లోకి వెళ్లింది. బస్సు ముందువైపు భాగంగా బాగా దెబ్బతింది. బస్సు డ్రైవర్ శేఖర్ కాళ్లకు బాగా గాయాలయ్యాయి. సీటు వద్ద ఇరుక్కుపోయాడు. హైవే సిబ్బంది వచ్చి అతడిని బయటకు తీశారు. డ్రైవర్‌ది చిత్తూరు జిలా నెమలికుంట గ్రామం. ప్రమాద సమయంలో ఆ బస్సులో 40 మంది ప్రయాణికులు ప్రయాణిస్తున్నారని, వారిని ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని ఎస్ఐ వినోద్ బాబు తెలిపారు. డ్రైవర్ శేఖర్‌ను అద్దంకి ప్రభుత్వం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



బస్సులో ఇరుక్కుపోయిన డ్రైవర్ శేఖర్

సీడ్ యాక్సిస్ రోడ్డుపై పచ్చదనం పెంచాలి

అమరావతి అభివృద్ధి సంస్థ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ లక్ష్మీపార్థసారథి



తాడికొండ: అమరావతి రాజధానికి వెళ్లే సీడ్ యాక్సిస్ రోడ్డుపై పచ్చదనం పెంచాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) చైర్ పర్సన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీ పార్థసారథి అధికారులను ఆదేశించారు. సీడ్ యాక్సిస్ రోడ్డును బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలం దృష్ట్యా నాటిన మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. పలు సూచనలు చేశారు. అనంతరం ఎన్-9 రోడ్డుపై బఫర్ జోన్‌ను అభివృద్ధి చేసేందుకు ప్రణాళిక రచించాలని ఉద్యాన అధికారులను ఆదేశించారు. పర్యటనలో ఆమె వెంట ఏడీసీ జనరల్ మేనేజర్ కె శ్రీ హరిరావు, చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకరరావు, ఉద్యాన విభాగాధిపతి వీఎస్ ధర్మజ పాల్గొన్నారు.

జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ అడిషనల్ కమిషనర్ బదిలీ

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): గుంటూరులోని జీఎస్టీ, కస్టమ్స్ అప్పీల్స్ కార్యాలయంలో అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న నూతలపాటి సౌమ్య రాష్ట్ర సర్వీస్‌కు డెప్యూటేషన్‌పై బదిలీ అయ్యారు. ఈ మేరకు రింగురోడ్డు లోని అప్పీల్స్ కార్యాలయంలో బుధవారం ఆమె విధుల నుంచి రిలీవ్ అయ్యారు. గురువారం ఆమె విజయవాడలో రాష్ట్ర జీఎస్టీ అడిషనల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టనున్నారు. సౌమ్య 2011 సివిల్ సర్వీసెస్‌కు చెందిన ఐఆర్ఎస్ అధికారిణి. ఢిల్లీలోని కేంద్ర ఆర్థిక శాఖ నుంచి వచ్చిన ఆదేశాల మేరకు ఆమె సెంట్రల్ ట్యాక్స్ నుంచి స్టేట్ ట్యాక్స్‌కు మారనుండటం విశేషం. ఆమె డెప్యూటేషన్ గడువు మూడేళ్లు మాత్రమే.

శ్రీవారి కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు

- టీటీడీ , జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేయాలి
- టీటీడీ ఈవో శ్యామలరావు ఆదేశం

తాడికొండ: వెంకటపాలెం శ్రీవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 15న జరుగనున్న శ్రీనివాస కల్యాణానికి సంబంధించిన అన్ని పనులను సకాలంలో పూర్తి చేయాలని టీటీడీ ఈవో జె.శ్యామలరావు అధికారులను ఆదేశించారు. వెంకటపాలెంలోని ఆలయ ప్రాంగణంలో బుధవారం టీటీడీ అధికారులు, కలెక్టర్ ఎస్. నాగలక్ష్మితో కలిసి ఆయన గుంటూరు జిల్లా అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. శ్యామలరావు మాట్లాడుతూ శ్రీనివాస కల్యాణంపై సమీప గ్రామాల్లో టీటీడీ ప్రచార రథం ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా కల్యాణ వేదిక పరిసరాల్లో అవసరమైన గ్యాలరీలు, క్యూలైన్‌లో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. శ్రీవారి ఆలయం, కల్యాణ వేదిక పరిసరాల్లో భక్తులను ఆకట్టుకునేలా విద్యుత్ అలంకరణలు చేపట్టాలన్నారు. భక్తులు సులభతరంగా స్వామిని దర్శించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. ట్రాఫిక్ అంతరాయం తలెత్తకుండా పార్కింగ్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కల్యాణానికి భజన బృందాలు, శ్రీవారి సేవకులను పెద్ద ఎత్తున ఆహ్వానించాలని ఆదేశించారు. జిల్లా,



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న టీటీడీ ఈవో జె.శ్యామలారావు

టీటీడీ అధికారుల కోసం ప్రత్యేకంగా జాయింట్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని చెప్పారు. కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టి సీసీ కెమెరాలతో నిరంతరం భద్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు సులువుగా వచ్చేందుకు వీలుగా తగినన్ని ఆర్టీసీ బస్సులు నడిపేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్వామి కల్యాణాన్ని నేరుగా చూడలేని లక్షలాది మంది భక్తుల సౌలభ్యం కోసం ఎస్వీబీసీ ద్వారా ప్రత్యక్ష ప్రసారం చేయాలని ఆదేశించారు. వేదిక పరిసరాలలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు .అత్యవసర సమయంలో తక్షణం స్పందించేలా విపత్తు నిర్వహణ బృందాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. భక్తులకు అవసరమైన వైద్య సదుపాయాలు, మందులు, సిబ్బంది, అంబులెన్సులు అందుబాటులో ఉంచాలన్నారు. భక్తులకు అన్నప్రసాదాలు, తాగునీరు, మజ్జిగ పంపిణీ చేసేందుకు అవసరమైన శ్రీవారి సేవకులను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. సాయంత్రం 4 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడానికి తగు ఏర్పాట్లు చేయాల్సిందిగా హెచ్ డీపీపీ కార్యదర్శిని ఆదేశించారు. అనంతరం ఆయన అధికారులతో కలసి కల్యాణ వేదిక, తదితర పరిసరాల్లో జరుగుతున్న ఏర్పాట్లను పర్యవేక్షించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో టీటీడీ అదనపు ఈఓ సీహెచ్.వెంకయ్య చౌదరి, జేఈఓ వీరబ్రహ్మం, గుంటూరు ఎస్పీ సతీష్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పర్యవేక్షణకు మంత్రుల బృందం

సాక్షి, అమరావతి: శ్రీనివాస కల్యాణం ఏర్పాట్లను పర్యవేక్షించేందుకు మంత్రుల బృందం ఏర్పాటైంది. సీఎం చంద్రబాబు ఆ కార్యక్రమానికి హాజరు కానున్న నేపథ్యంలో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డితోపాటు అనగాని సత్యప్రసాద్, వి.అనిత, పి.నారాయణ, కందుల దుర్గేష్‌తో కూడిన బృందం ఏర్పాట్ల పర్యవేక్షణకు గురువారం ఆలయాన్ని సందర్శిస్తారని, టీటీడీ ఈఓ కూడా అందుబాటులో ఉండాలని సూచిస్తూ దేవదాయ శాఖ కార్యదర్శి వి.వినయ్ చంద్ బుధవారం మెమో జారీ చేశారు.

వైభవంగా మల్లేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



విద్యుత్ దీపాల అలంకరణలో దేవాలయం

భట్టిప్రోలు: స్థానిక శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం బిందె తీర్థం, అభిషేకం, నిత్య హోమం, బలిహరణలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి ఆలయంలో జగజ్యోతి, ఆ తరువాత ఎదురుకోల మహోత్సవం వైభవంగా జరిగింది. అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘం సభ్యులు శ్రీ స్వామి కల్యాణానికి తలంబ్రాల బియ్యం, మెట్టెలు, మంగళ సూత్రాలు సమర్పించారు. దివ్య కల్యాణ మహోత్సవంలో తిరువీధుల నాని నాగార్జున, రోజ దంపతులు పాల్గొన్నారు. అనంతరం కల్యాణమూర్తులైన స్వామి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాలలో ప్రధాన ఘట్టమైన దివ్య రథోత్సం గురువారం సాయంత్రం జరుగుతుంది. కార్యక్రమాలను దేవాలయ కార్యనిర్వాహణాధికారి, రేపల్లె ఇన్‌స్పెక్టర్ శనగవరపు కుమార్‌బాబు, వంశపారంపర్య ధర్మకర్తలు, అద్దేపల్లి–భట్టిప్రోలు పద్మశాలీయ బహుత్తమ సంఘీయులు పర్యవేక్షించారు.

రథోత్సవానికి పోలీస్ బందోబస్తు

బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని గురువారం నిర్వహించనున్న దివ్య రథోత్సవానికి పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు వేమూరు డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

శ్రీవారి తిరు కల్యాణం.. రమణీయం

రేపల్లె రూరల్: పట్టణంలోని ఉప్పూడి రోడ్డులో గల శ్రీలక్ష్మీ గోదా సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో భాగంగా లక్ష్మీ, గోదా సమేత వేంకటేశ్వరులకు మంగళస్నానాలు చేయించి, వధూవరులుగా అలంకరించారు. అనంతరం వేద మంత్రాలు, మంగళవాయిద్యాల నడమ కల్యాణాన్ని కనుల పండువగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తిరు కల్యాణ వేడుకలను తిలకించి, స్వామికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. అనంతరం అన్నసంతర్పణ నిర్వహించారు. రాత్రి శ్రీలక్ష్మీ, గోదా, వెంకటేశ్వరుడి విగ్రహాలను పురవీధుల్లో ఊరేగించారు.



తిరు కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు

నయనానందకరంగా దివ్య కల్యాణ మహోత్సవం

చుండూరు(వేమూరు) : చుండూరు మండలంలోని చినపరిమిలో గల శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో దివ్య కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం ఉదయం నిత్య హోమం, బలిహరణ, మోహిని వేషంలో స్వామి గ్రామోత్సవం జరిపారు. సాయంత్రం ఎదుర్కోల ఉత్సవం, స్వామి దివ్య కల్యాణ ఉత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దివ్య కల్యాణ మహోత్సవాన్ని 14వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

